# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  20-07-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 23వ తేదీ నుండి యుకె, మాల్దీవులలో పర్యటించనున్నారు.
- పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి.
- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.
- ఘజియాబాద్ నుండి 10 కొత్త వాణిజ్య విమానాలను కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఈ రోజు ప్రారంభించారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు యునైటెడ్ కింగ్‌డమ్, మాల్దీవులలో పర్యటించనున్నారు. తొలిదశలో ప్రధానమంత్రి ఈ నెల 23, 24 తేదీల్లో యుకెలో పర్యటించి, భారత్, యుకె ద్వైపాక్షిక సంబంధాలపై ఆ దేశ ప్రధానమంత్రి స్టార్మర్‌తో విస్తృత స్థాయి చర్చలు జరుపుతారు. అలాగే.. ప్రాంతీయ, ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై వారు అభిప్రాయాలను పరస్పరం తెలియజేసుకుంటారు. రెండో దశలో ప్రధానమంత్రి ఈ నెల 25 నుండి 2 రోజుల పాటు మాల్దీవులలో పర్యటిస్తారు. మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ఆయన 'గౌరవ అతిథి'గా హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా మాల్దీవుల అధ్యక్షులు డాక్టర్ మొహమ్మద్ మొయిజ్జుతో చర్చలు జరుపుతారు. 'సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రతా భాగస్వామ్యం' కోసం భారతదేశం-మాల్దీవులు ఉమ్మడి దార్శనికత అమలులో పురోగతిని ఇరువురు నేతలు సమీక్షిస్తారు. కాగా.. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

==============================

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 21 వరకు జరిగే ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 13న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లు 2025... ఈ సమావేశాల్లో ప్రభుత్వ ప్రధాన అజెండా కానుంది. భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు బైజయంత్ జే పాండా నేతృత్వంలోని పార్లమెంటు

సెలెక్ట్ కమిటీ ఆమోదించిన ఈ బిల్లును కేంద్రమంత్రి వర్గం ఆమోదం కోసం పంపి, తరువాత ఈ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నారు. మణిపూర్ వస్తు సేవల పన్ను 2025, మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు ఉద్దేశించిన బిల్లు, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించే జన్‌విశ్వాస్, నిబంధనల సవరణ బిల్లు సహా మొత్తం 8 బిల్లులతో పాటు మరో 7 పెండింగ్ బిల్లులు ఈ సమావేశాల్లో చర్చకు రానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత పాత్ర కీలకమని కేంద్ర యువజన, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. డ్రగ్-ఫ్రీ యూత్ ఫర్ డెవలప్డ్ ఇండియా అంశంపై 3 రోజుల పాటు వారణాశిలో జరిగిన యువ ఆధ్యాత్మిక సదస్సు ఈరోజు ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ.. డ్రగ్-ఫ్రీ యూత్  కోసం దేశవ్యాప్తంగా ప్రచారానికి ఈ తీర్మానం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువతను మాదకద్రవ్య రహితంగా మార్చడానికి "కాశీ సంకల్ప్ పాత్ర" ద్వారా ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించామని మన్సుఖ్ మాండవీయ పేర్కొంటూ..

(వాయిస్ 36 సెకన్లు)

కేంద్ర సహాయ మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే, వివిధ రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 120కి పైగా ఆధ్యాత్మిక సంస్థలకు చెందిన 600 మందికి పైగా యువ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో టీ ఎగుమతులు 2.85 శాతం పెరిగాయని టీ బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి సాధించినట్టు పేర్కొంది. దేశం మొత్తం మీద టీ ఎగుమతులు 250.73 మిలియన్ కిలోగ్రాముల నుండి 257.88 మిలియన్ కిలోగ్రాములకు పెరిగాయని వివరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) అందించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా నిర్ధారణలకు రావడం సరికాదని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈరోజు ఆయన ఘజియాబాద్ లోని హిండన్ సివిల్ టెర్మినల్ నుండి 10 కొత్త వాణిజ్య విమానాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ ఘటనకు సంబంధించిన తుది నివేదిక వెలువడే వరకూ వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. విమాన ప్రమాద ఘటనపై కొన్ని పాశ్చాత్య మీడియా సంస్థలు స్వార్థ ఆసక్తితో కథనాలు ప్రచురించాయని విమర్శించారు. భారతదేశంలోనే బ్లాక్ బాక్స్‌ను డీ కోడ్ చేసినందుకు AAIBని ఆయన ప్రశంసించారు. అలాగే హిండన్ టెర్మినల్ నుండి దేశంలోని 10 ప్రధాన నగరాలకు ప్రత్యక్ష విమాన సేవలు ప్రారంభమయ్యాయని, ఈ విమానాలన్నీ ఘజియాబాద్ నుండి నేరుగా అందుబాటులో ఉంటాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రేపు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉభయ సభలు సజావుగా సాగేందుకు.. కేంద్ర ప్రభుత్వం ఈరోజు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి, రాజ్యసభలో సభా నాయకుడు జగత్ ప్రకాష్ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, డాక్టర్ ఎల్. మురుగన్ హాజరయ్యారు. ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... ఉభయ సభలు సజావుగా పనిచేసేలా చూడాలని ప్రతిపక్షాలను కోరినట్టు తెలిపారు. సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందని, నేతలు తమ పార్టీల వైఖరిని, లేవనెత్తనున్న అంశాలను వెల్లడించారని తెలియజేశారు. పాలకపక్షం, ప్రతిపక్షం మంచి సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెనారస్ లోకోమోటివ్ వర్క్స్ (BLW) తన 2 వేల 500వ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను ఈరోజు విడుదల చేసింది. WAP-7 క్లాస్ కు చెందిన ఈ 6 వేల హార్స్‌పవర్ లోకోమోటివ్‌లో ఎయిర్ కండిషన్డ్ క్యాబిన్‌లు, రియల్-టైమ్ మానిటరింగ్ సిస్టమ్‌లు, రీజెనరేటివ్ బ్రేకింగ్ తో పాటు గంటకు 140 కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యం కలిగి ఉంది. 2017లో ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ఉత్పత్తిని ప్రారంభించిన BLW.. కేవలం 8 సంవత్సరాల్లో ఈ ఘనతను సాధించింది. ఈ సందర్భంగా BLW జనరల్ మేనేజర్ నరేష్ సింగ్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ఇప్పటివరకు 7 వేల 498 డీజిల్ ఇంజిన్‌లతో సహా మొత్తం 10 వేల 822 లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేసిందని, ఇటీవలే మొజాంబిక్‌కు లోకోమోటివ్‌లను ఎగుమతి చేసిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాల సమయంలో హిమాచల్ ప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో నష్టాలను అంచనా వేసేందుకు వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధి బృందాన్ని నియమించామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. విపత్తుల సమయంలో ఎటువంటి వివక్ష లేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అండగా నిలుస్తుందని ఆ శాఖ పేర్కొంది. రక్షణ, సహాయ కార్యకలాపాల కోసం ఆ రాష్ట్రంలో మొత్తం 13 NDRF బృందాలు మోహరించాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా... తరచుగా ఏర్పడుతున్న ప్రకృతి వైపరీత్యాల తీవ్రత దృష్ట్యా.. హిమాచల్ ప్రదేశ్‌లో బహుళ రంగాల కేంద్ర బృందాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం తన ఇంధన భవిష్యత్‌ను దశల వారీగా భద్రపరుచుకుంటోందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమంలో ఈరోజు ఒక ప్రకటన చేస్తూ.. చమురు స్వయం సమృద్ధి దిశగా దేశం స్థిరంగాను, నమ్మకంగాను అడుగులు వేస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =